


రచన: ధనికొండ హనుమంతరావు

ఎండాకాలం సెలవులకు ఇంటికి వెళ్లినప్పుడే జానకి ఒక పెద్ద సమస్యగా తయారైంది. అంతకుపూర్వం ఆమెను నేనెరగకపోలేదు. దాదాపు మా ఇంటిలోని వ్యక్తివలెనే మెలగుతూవుండేది. ఇప్పుడు పెరిగిపెద్దదైనాకూడా ఆస్వాతంత్ర్యాన్ని ఆమెమరిచిపోలేదు. కాని ఇన్నాళ్లూలేని కొత్తఆకర్షణేదో ఆమెలో స్పష్టంగా కనిపించింది.

యీవిషయంలో నేను తొందరపడలేదు. బుద్ధిపోయినంతవరకూ ఆలోచించాను; ఆమె నాకోసమై తపించిపోతోందని ధృఢనిశ్చయం చేసుకునేదాకా ఒక్కఅడుగుకూడా ముందుకు వేయలేదు. ఆఅడుగుముందుకు వెయ్యటమే పెద్దప్రమాదమైందని తెలుసుకునేందుక్కూడా ఎక్కువసేపు పట్టలేదు.

ఒంటరిగా ఆమెను గదిలో పట్టుకున్నప్పుడు, ఆమె ఎంతో భయపడింది. అరిచిగోలచేసి నలుగుర్నీ పిలిచి, నాశరీరంలోని ఎగుడుదిగుళ్లను సమమట్టానికి తేకపోయినా, నానాతిట్లూ తిట్టి విదిలించుకొని వెళ్లిపోయింది. నాన్నతో చెప్పి, వీపుతాపామరబా చేయిస్తుందేమోననే భయంతో అర్ధరాత్రి ఎవరికీ తెలియకుండానే సెలవలైనా పట్టణంలోనే గడిపేందుకుగాను బిఛాణా ఎత్తేశాను.

ఆ సంఘటన జ్ఞాపకం వొచ్చినప్పుడల్లా శరీరం గగుర్పొడిచేది. ఆశృంగభంగం నాలోగొప్ప మార్పునుకూడా తెచ్చింది; పరస్త్రీని—ఆమె ఎలాటిదనే విచక్షణలేకుండా, గౌరవించటం మొదలుపెట్టాను. యీగౌరవానికి భయమేకారణం కావొచ్చు; ఎంతో జాగర్తగా వొళ్ళుదగ్గరపెట్టుకో సాగాను.

రెండు సవత్సరాల తరువాత కాని నేను మళ్ళీ మావూరు వెళ్ళలేదు. యీలోగా ఇక్కడ అనేకమార్పులు జరిగినవి. ముఖ్యంగా జానకి తండ్రిపోవటం, ఆమెకాపరానికివెళ్లిన ఏణ్నర్ధానికే విధవగా తిరిగిపుట్టింటికి రావటం

జరిగింది. ఇప్పుడు నాకొక ఆత్మతృప్తి తోచింది. నాకామెచేసిన పరాభవానికి విధి ఆమెను తగిన విధంగా శిక్షించాడనే ఒక ఓదార్పు కలిగింది. ఆమె నా జాలిని పొందలేక పోవటంలో ఆశ్చర్యంలేదేమో ?

ఎదురిల్లే కనుక ఆమెను చూడటంకూడా తటిస్థించింది. అంతధైర్యంగా ఆమెను చూడలేక పోయినప్పటికీ, ఆమె దీనస్థితిలో నాచూపును భరించితీరవలసిన బాధ్యత ఆమెకు వుందని నాకుగట్టిగా తెలుసు. తమాషా ఏమిటంటే నేను అనుకున్నంత తక్కువస్థితిలో జానకి లేదు. యీదుస్సంఘటనల్ని ఆమె అప్పుడే జీర్ణించుకొని, ఒడుదుడుకుల్లేని సాఫీ జీవితాన్ని గడుపుతూన్నట్లే తోచింది. జానకిలో ఇంతధైర్యస్థయిర్యాలు వుంటవని నేనెప్పుడూ అనుకోలేదు.

యీ పరిస్థితుల్లోకూడా తిరిగి జానకిమీద గౌరవభావం విజృంభించింది. పల్లెటూరి యువకులు వూళ్ళోని యువతుల్నిగూర్చి మాట్లాడుకునేప్పుడు, జానకి విషయంవొస్తే ఎటూచెప్పకుండా వూరుకునేవాణ్ని. ఎవరైనా ఆమెనుగూర్చి చెడుగామాట్లాడినట్లయితే, వారిని మందలించేందుకుకానీ, ఆమెశీలాన్ని ఆకాశమెత్తున ఎత్తటానికికానీ వెనుకంజవేసేవాణ్నికాదు. మిగతా యువకులందరి అభిప్రాయం వొకఎత్తూ, నావొక్కడి అభిప్రాయమూ వొకఎత్తుగానూవుండేది. దీనికి కారణమల్లా జానకికీ నాకూ చిన్ననాటిస్నేహం. ఆమె ఇంటెదురుగానే ఉండటంవల్ల, ఆమెనుగూర్చి నాకు తెలిసినంత వివరంగా మరెవరికీ తెలియదని వారందరూ అనుకోవటమూను. నేను ఆమెదగ్గర పొందిన శృంగభంగం ఎవరికీ తెలియక పోవటంవల్ల నామాటలకు అవిలువ ఎప్పుడూవుండే అవకాశం ఏర్పడి పోయింది.

వొక్కనారాయణతోనే నాకు పెద్దపేచీగావుంది. వాడికీ నాకూ అభిప్రాయ భేదమల్లా జానకి విషయంలోనే ! ఇదిమాస్నేహానికి ఏ విధంగానూ అడ్డు రానప్పటికీ నేనునొచ్చుకునే విషయంగానే ఇది పరిణమించింది.

"యీ ఆడవాళ్ల విషయం నాకు చెప్పవొక. పైకి మహాపవిత్రంగానే కనిపిస్తారు; కాని వారివ్యక్తిగతజీవితం సంగతి ఎవరికి తెలుస్తుంది ? ఉదాహరణకు—జానకి వుందనుకో. ఆమెసంగతులన్నీ నీకుపూర్తిగా తెలుసనుకుంటావ్. కాని ఆమెవ్యక్తిగత రహస్యాలు నీకేం తెలుసు ?"

"నువ్వు ఆడవాళ్లందరికీ కలిపి ఒకే వొక సిద్ధాంతాన్ని ఏర్పరచటం పెద్ద పొరపాటు" అన్నాను.

"చాలామంది విషయం చెప్పాను..."

"సరే—జానకి వ్యక్తిగత జీవితంనాకు తెలియదనిగా నువ్వనటం ... మరి నీకుమాత్రం ఏంతెలుసూ, ఆమెనుగూర్చి మాట్లాడటానికి ?"

వాడి గొంతులో వెలక్కాయ పడ్డట్టయింది. చాలా సేపటిదాకా జవాబు చెప్పలేక పొయ్యాడు. చివరకు అన్నాడు: "పరిస్థితుల్ని బట్టి...ఆమె రాయీ రప్పా కాదు. నిండు యవ్వనంలో వుంది. విధవరికాన్ని ఆవయస్సులో భరించటమంటే ఏటికి ఎదురీదటమే కదా! పైపెచ్చు లోకంలోని తన వయస్సు వాళ్లం దర్నీ చూస్తూ, వారికి లభ్యమయే ఆనందాన్ని గూర్చి ఆలోచిస్తూ చలనం లేకుండా నే పడివుండటం ఎంత కష్టమో ఆలోచించు..."

"అది కాదు..."

"ఇంకా విను: లంకంత ఇల్లు. తల్లీ, తనూ జీతగాడూతప్ప వేరెవ్వరూ లేరు. ఆమె ఏంచేసినా ఎవరికీ తెలిసే అవకాశంలేదు. తల్లి అంటావా—ఆముసలిది వొకమూల పడివుంటుంది. ఒకవేళ చూచాయగా తెలిసినా, ఆమెపట్టించుకోదు. కన్నకూతురిమీద మమకారం వల్లనైతేనేం, ఆస్థితిలో జానకిమీద సానుభూతి వల్లనైతేనేం ఇది సాధ్యమయేందుకు ఎలాటి ఆటంకాలూ లేవు—"

ఇక ఆగలేక వాడిమాటలకు అడ్డంపడ్డాను: "ఎంతసేపూ అనుకూలపరిస్థితుల్నిగూర్చే మాట్లాడుతున్నావ్ కాని, ప్రతికూల పరిస్థితుల మాటేమిటి? ఆమె యవ్వనోద్రేకాన్ని తట్టుకోలేక చేసిన ఎంతచిన్న పొరపాటైనా ఇట్టేబైట పడేందుకు అవకాశం లేకపోలేదు. నువ్వాలోచించినట్టే జానకి కాలుజారే అవకాశాలున్నవనే అభిప్రాయాలున్న ఇరుగు పొరుగులు ఆసంఘటన కోసం వేచి కూర్చోకమానరు. ఏకాస్త అందినా మొత్తాన్ని బైటికి లాగకామానరు. జానకి సద్వంశంలో పుట్టింది. విజ్ఞాన వికాసాలున్నవి. కుటుంబ గౌరవాన్ని మంటకలిపే ప్రయత్నం చేయదు..."

"కాని..."

"కానీ లేదు; అర్థణాలేదు. యీ పరిస్థితుల సంగతి అటుంచు. ఆమె శీలాన్ని శంకించేందుకు, రుజూచేయవలసిన బాధ్యత నీకువుంది"

"ఐతే నీవుద్దేశం కేవలం సంఘటనను చూపాలనా? బాగుంది. అదెలా సాధ్యం?"

"కానప్పుడు అంత తేలిగ్గా మాట్లాడకూడదు."

"నాకు నమ్మకమున్న విషయాన్ని చెప్పారా. అంతే!"

వాడునమ్మే దానికి నాబాధ్యతేమీ లేదు. ఏదోపిచ్చి నమ్మకానికి కారణం కూడా చెప్పలేని స్థితిలో నారాయణమీద జాలివేసింది. అందుకనే యీవాదాన్ని మరి పెరగనీయలేదు.

ఆరాత్రి నుంచే నాలో కొత్తరకం ఆలోచనలు బైలుదేరినవి. నారాయణ చెప్పిన మాటల విలువను అప్పుడు నేను గ్రహించలేదు కాని, ఇప్పుడు ఆమాటల్ని

గూర్చి ఆలోచించ వలసిన పనివున్నదనే తోస్తోంది. నిప్పులేకుండా పొగరాదు కనుక, నారాయణ కేవలం అంత తేలిగ్గాకాకుండా, ఏదోకారణంవల్లనే జానకిని అనుమానించి వుంటాడు; ఆకారణమేదో నాతో అనేందుకు వాడు సందేహించి అది తనునమ్మే విషయంగా మాత్రమే తేల్చాడు. కాని దీనికి కొంత పూర్వగాథ—నిజమైనదో, అబద్ధమైనదో, ఉండి తీరాలనే నానమ్మకం.

జానకిని ఒక విధంగా అనుమానించేందుకు ఇంకో పెద్ద కారణం కూడా వుంది; అది నేనామెవల్ల పొందిన పరాభవానికి గాను ఆమెను నీచపరిచే ఉద్దేశాలకు, నాకు తెలియకుండానే ఏర్పడే వొకానొక ప్రాముఖ్యత. ఐతే అంత గుడ్డిగా నమ్మేందుకూ, దాన్ని ప్రచారం చేసేందుకూ నేనంత మూఢుణ్ని కాదు కనుక, మరికొంత కాలం వేచివుండాల్సి వుంటుంది.

పోతే నారాయణ మాటల ధోరణిలో ప్రస్తుతం మరొక ఆశకూడా కనిపిస్తోంది. పరిసరాల్నిబట్టి దృశ్యం తీరును చిత్రించుకున్నప్పుడు, జానకిలాంటి అందగత్తెమీద నా ఆశలు తిరిగి చిగురించేందుక్కూడా మంచి అవకాశమేవుంది. ఇష్టాయిష్టాలనేవి మూడు వంతులుగా పరిస్థితినిబట్టి మారుతూంటవి కనుక, ఆమె ఇష్టమనేది ఇప్పుడు కొత్తగా ఏర్పడినా ఏర్పడవొచ్చు. కనుక ఇంకొక్కసారి ప్రయత్నిస్తే బావుంటుందేమో ?

నాఆలోచనల రూపం ఇలామారినప్పుడు — ఆశతోపాటు నిరాశకూడా తయారైంది. ప్రస్తుతం ఆమెకూనాకూ మధ్యకనిపించనిఒకానొక విరోధం వేళ్లాడుతూనేవుంది. ఆమెను యీస్థితిలోకూడా నేనీ మూడునెల్లనుంచీ పలకరించనే లేదు; అందుకు భయపడికానీ, ఆ అవసరం నాకు లేదనుకోనీ ఏకారణమైనా ఇది జరిగి, ఆపట్టుదలలు మరింతగా బిగిసినవి. నేటి పరిస్థితులకన్న — దూరం ఆలోచిస్తే — రెండేళ్ళనాటి పరిస్థితులే అనుకూలమైనవిగా కనిపించినవి. కాని ఆనాడు ఏంజరిగిందో, యీనాడూ అదేజరుగుతుందని, అందువల్ల నేను మరింత బాధకు గురికావాల్సి వుంటుందని అనుమానం కలిగింది. చిరుచెమటలుకూడా పోసినై.

♦ ♦ ♦ ♦

నాలో ఒక కొత్త స్థితి ఏర్పడింది. జానకిని అటుదూషించనూలేను, ఇటు భూషించనూలేను. ఆమెవిషయం పట్టించీ పట్టించుకోని అపరచితవ్యక్తిమనస్తత్వం లోకి దిగాను.

ఎండాకాలం కావటంవల్ల వీధిలోనే పడుకునేవాణ్ని. ఎనిమిదింటికే వూరంతా మాటుమణిగినా నిద్రకోసం గుంజుకునేవాణ్ని. మరీ వెన్నెల రోజులైతే ఇంకచెప్పక్కర్లేదు. నాలాగే జానకికూడా బాధపడుతోందని వూహించి తృప్తిపడేవాణ్ని !

నాలాంటి ఒంటరిజీవితాన్ని గడపలేక ఆమె నాకోసమై ఏనాటికన్నా వీధి తలుపు తెరుస్తుందనే ఒక ఆశకూడా లేకపోలేదు. యీపని ఆమే చేయవలసిన బాధ్యతకూడా వున్నదని నానమ్మకం. ఎందుకంటే నావొంతు రెండుసంవత్సరాల క్రితమే ఐపోయింది. ఆసంగతి ఆమెకు తెలియకపోతేగా ?

యీ పిచ్చివూహతో మరింతసేపు మేలుకునే వాణ్ణి. కొన్నివూహలు కేవలం నిరాధారంగానే ఏర్పడుతవి; వాటివల్ల మనకొక ఆనందం కలగటంవల్లనే కొంతసేపటివరకూ ఆ వూహాల నిరాధారతను పాటించం; ఆతరువాత బాధ తప్పదు. తమాషా ఏమిటంటే తిరిగితిరిగి ఆ ఊహాలే కావాలని, వాటితోనే మళ్లీ మళ్ళీ తృప్తిపడటం, బాధపడటం జరుగుతుంది.

అర్ధరాత్రిదాటింది. అంతకుముందే చంద్రుడు అస్తమించాడు. చాలాసేపటినుంచీ గుడ్డివెలుగుకు కన్నుబాగాఅలవాటుపడి వుండటంవల్ల, నాకంతాస్పష్టంగానే కనిపిస్తోంది. ఒక పురుషుడు రహదారిన వొస్తూనే చప్పున జానకి ఇంటిముందు ఆగి, ఒక్కసారి అటూఇటూచూసి, వీధివాకిలిగుండానే లోన ప్రవేశించాడు. మొదట్లో దొంగేమో అనుకున్నాను.

దొంగకు ఇంత తేలిగ్గా ప్రవేశం దొరకదు కనుక ఇదేదో అంతా ముందుగానే అనుకొన్న వ్యవహారమై వుండాలని తేలిపోయింది. ఆమనిషినైతే పోల్చలేనుకాని, జానకికోసమే వాడు ఆమె ఇంట్లోకి దూరాడని మాత్రం నాకు గట్టిగా తెలుసు.

యీ జానకి—దీన్నిగూర్చి నాకెంతో మంచి అభిప్రాయాలుండేవి. దీన్ని వెనకేసుకొని పోట్లాడాను కూడాను! ఇక నాకళ్లారా చూసిన యీ దృశ్యంతో దానిమీద నాకొక దురభిప్రాయం ఏర్పడిపోయింది. ఇంత నీచురాలని తెలుస్తే, నారాయణతో వాగ్వాదం వేసుకునే వాణ్ణే కాదు. నారాయణ దీనివ్యవహారాన్ని నాకన్న ముందుగానే పసిగట్టాడు. ఐతే యీ సంఘటన ఆధారంగా రేపు నేను నారాయణతో కానీ, మరెవరితోకానీ జానకి శీలాన్నిగూర్చి చెడుగా మాట్లాడలేను. ఎందుకనంటే నేను నారాయణను నిలవదీసినట్టుగానే, నన్నావ్యక్తి నిలవదీసి రుజూచేయమంటే గొంతులో వెలక్కాయ పడుతుంది!

ఇది—నన్ను కాదన్నందుకు, ఒక విధంగా ఆమె శీలాన్ని మెచ్చుకొని, దానిమీద ఒక గౌరవ భావాన్ని ఏర్పరుచుకున్నాను; ఇప్పుడు యీపని చేస్తోందంటే అర్ధమేమిటి? వ్యభిచారిణిగా మారినందుకు కాకపోయినా, ఆ ఆనందాన్ని నాకూడా పంచనందుకేమో జానకంటే మండి పోతోంది.

ఆ వ్యక్తి ఎవరా అనే సమస్య తీరలేదు. కాపలావేసి కూర్చున్నాను; మళ్లీ బైటికి రాకపోతాడా అని...ఎప్పుడు నిద్రపట్టిందో కాని—తెల్లారాక, పొరపాటు జరిగిందని వేలు కొరుక్కున్నాను.

ఇదివరకు జానకంటే వుండే బెరుకు పోయింది. ఆమెను తేలిగ్గా 'నీ సంగతి నాకు తెలియదూ?' అన్నట్టు చూసే ధైర్యం కలిగింది. అంతేకాదు—ఇంకా ముందుకు పోయి, ఆమెకోసం ప్రయత్నించి—ప్రయత్నించటమేమిటి, సరాసరి ఆమె పడకగదిలోకే దూరినా మరేం ప్రమాదం లేదన్నంత ధీమా ఏర్పడి పోయింది. ఏమైనా నోరు కదిపిందా...ఆమె పరువు మర్యాదలు నాచేతుల్లోనే వున్నవనే విషయం అర్థమయ్యేట్టు చేస్తాను.

యీసారి దూరం ఆలోచించాను; అంతా పట్టాలమీది రైలులాగే, సక్రమంగా జరిగి తీరాలనే నమ్మకం చిక్కింది. అటునుంచి ఆహ్వానం రావటానికి వున్న ఇబ్బందులుకూడా నాకు తెలుసు; రాత్రి జరిగిన వ్యవహారం నాకు తెలుసని ఆమెకు తెలియదుగా! అదీగాక నేను ఆమె పిలుపు కోసమే ఎదురు చూస్తూంటే, విలువైన కాలమంతా దొర్లిపోనే పోతుంది; బహుశా అప్పటికి ఆమె తలతోపాటు నాతలా ముగ్గుబుట్టకావొచ్చు. కనుకనే తొందర పడ్డాను.

ఎన్నడూలేనిది ఆమె ఇంటికి వెళ్లాను. యీ వెళ్లటంలో నాకున్న ధైర్యం సడలిపోతుందనే భయంలేదు. యీసారి నాచేతుల్లో ఆయుధం వుండనే వుందిగా! నేను వెళ్లేప్పటికి ఆమె తల్లి దొడ్లో పనిచేసుకుంటోంది. జానకి ఎదురుపడి, మొహంచిట్లించి చీదరించుకుంటుందనుకున్నాను. కాని అలాటిదేమీజరుగలేదు. ఆమెఎంతో స్నేహభావంతో ఎదురై ఆహ్వానించింది, నవ్వుతూ "బాగున్నారా ?" అంది.

నాసగం శక్తులు చచ్చినయ్. ఏమాత్రం ఎదిరించే స్వభావం కనబరిచినా పాశుపతాస్త్రాన్ని రెట్టింపు బలంతో సంధించేవాణ్ని...కాని కథ ఇలా అడ్డం తిరిగినందువల్ల వెంటనే చల్లారి పొయ్యాను.

"బాగానేవున్నాను...రోజూ చూస్తూనే వున్నావుగా !"

ఆమెనవ్వి వూరుకుంది. మామధ్య వేళ్లాడేనిశ్శబ్దం భరించరానంతగావుంది. ఏంచెయ్యాలి అనేఆలోచన ప్రారంభమైంది. ఏంచెయ్యాలని ఇక్కడికొచ్చాను? నేనుభయపడటమెందుకు ? పోయిన శక్తులన్నిటినీ తిరిగి కూడదీసుకుంటున్నాను.

"దారితప్పి వొచ్చినట్టున్నారు ?" అంది.

"లేదు...నీకోసమే"

"ఫోండి! పరాచికాలు మానలేదింకా"

"తమాషాకాదు. నీమీదిఆశలేనన్నిక్కడికి లాక్కొచ్చినయ్. యీసారితో ఎటోఅటు తేల్చుకుందామనుకున్నాను." ఆమెధోరణికి ఇది తగినసంభాషణ కాదని తెలుసు; ఇంతమోటుగా మాట్లాడుతానని ఆమెఅనుకొని వుండదేమోకూడా. కాని వృథాగా సంభాషణపెంచి, నాజూకులు పోవాల్సిన అవసరాన్ని తగ్గించు

కోవాలని, మధ్యలో దారితప్పినా, జేరవలసిన గమ్యస్థానమింకా నాదృష్టిలోంచి పోలేదు.

ఆమె మాట్లాడకుండా నా మొహంలోకి నవ్వి నేలచూపులు చూస్తూ నిలబడింది... అంగీకారమేనా? ఒక్కసారి వొళ్ళంతా విద్యుత్ ప్రవహించినట్లయింది. ఏమైనా కానిమ్మనుకున్నాను. చప్పున ఆమెచెయ్యి పట్టుకున్నాను. ఆమెఅభ్యంతరపెట్టలేదు; సిగ్గుపడి మాట్లాడనూలేదు.

“అబ్బ... వూరుకోండి, అమ్మవొస్తోంది” అంది.

బతికి పొయ్యాను. ఒక విధంగా వాళ్ళ అమ్మే యీ వ్యవహారాన్ని ఫైసలు చేస్తింది. ఎందుకంటే ప్రస్తుత సంఘటనకు ఆమె అడ్డంపడ్డా, ఆమె తల్లి వొస్తోందనే అభ్యంతరం తప్ప, జానకికి మరో అభ్యంతరం లేదనే సంగతి స్ఫటికమంత స్పష్టంగా తేలిపోయింది.

ఆమె తల్లిగారి దగ్గర నక్కవినయం చూపాను.

“బాబుకు కాఫీ ఇవ్వవే” అంది వాళ్ళమ్మ—దొడ్లోకివెళ్తూ.

జానకి వంటింట్లోకి మాయమైంది. వెధవకాఫీ లేకపోతే పోయింది, జానకితో పూర్తిగా వ్యవహార పరిష్కారమవలేదనే బాధకలిగింది.

నేను అనుకున్నదానికన్న జానకి తెలివైందే— ఐదు నిమిషాల్లోనే కాఫీతో హాజరైంది.

కాఫీ తాగుతూ “ఐతే జానకీ—ఎప్పుడురాను?” అన్నాను, ఆమె ఇచ్చిన చనువును ఎంతబాగా ఉపయోగించుకోగలిగానో తలుచుకుంటేనే గర్వం కలిగింది.

“ఎక్కడికి? ఎందుకూ?” అంది.

ఆమె ముఖకళనుబట్టి శాంతించాను కాని, లేకుంటే గుండెగుభేలుమనేదే!

“నీదగ్గరికి... ఎందుకో అప్పుడు చెపుతాను”

ఆమెమాట్లాడకుండా నేలచూపులు చూడసాగింది.

“మళ్లీ మీ అమ్మవొచ్చిందంటే అంతా మించి పోతుంది” అని హెచ్చరించాను.

ఆమె మౌనం భరించ రానిదైంది.

“మాట్లాడవేం?” అన్నాను బతిమాలే ధోరణిలో.

“నారాయణకు తెలుస్తే...?”

“ఎందుకు తెలుస్తుంది? నేను చెప్పనులే!” యీ నారాయణగాడితో ఇంత కలిసిమెలిసి తిరుగుతూన్నందుకు, ఎంత ప్రమాదం వాటిల్లింది!

"శాత్రికి రండి...దొడ్డివాకిలి దగ్గర...పదకొండింటికి—" అని చెప్తూనే ఇంట్లోకి మాయమైంది.

చొక్కా దులుపుకున్నా పోని కాఫీమరకను లెక్క చెయ్యకుండానే బైటపడ్డాను.

♦ ♦ ♦ ♦

రోజులు గడుస్తున్నాయ్. జానకితోడి స్నేహం దినదినాభివృద్ధవుతూనే వుంది. ఒకనాడు మామూలుగా జానకి విషయం మాస్నేహ బృందంలో చర్చనీయాంశమైంది.

నేనుమాత్రం ఎటూతొణకలేదు. వారిలోవారే తెలిసీ తెలియనిమాటలన్నా వింటూ వూరుకున్నాను. నారాయణ పూర్వం నాదగ్గర వాగినట్టే వాగాడు; దానికూడా నేను లెక్క చేయలేదు.

అందరూ ఇళ్ళకు వెళ్ళారు. నేనూ సాంబయ్యా మిగిలి పొయ్యాం.

"జానకి తిరుగుతోందంటావా ?" అన్నాడువాడు.

"ఏమో...పరిసరాల్ని బట్టీ పరిస్థితుల్ని బట్టీచూస్తే, తిరిగేందుకే అవకాశం వుందనుకొంటాను"

"నువ్వూ అట్లాగే మాట్లాడుతావేం ? మనం ఏదోమనస్సులో పెట్టుకొని ఆడవాళ్లనుగూర్చి ఇష్టంవొచ్చినట్టు మాట్లాడుతాం. ఇందాక ఆనారాయణగాడు అట్లావాగాతే, నాకు అరికాలిమంట నెత్తికెక్కిందం టేనమ్ము"

"ఎందుకనీ ?" అన్నాను.

"లేకపోతే...వెధవ మూడుసంవత్సరాలుగా ఆమెను అనుభవించాడా అంతకుముందు ఆమెను పతివ్రత అనేవాడు. వీడుఅక్కడికి రాకపోకలు సాగించాడు; వీడిపాలపడి ఆమె వ్యభిచారిణిఐంది. దాన్నేవీడు ప్రచారంచేస్తున్నాడంటే దానికి కారణమల్లా ఆమె వీడికి అవకాశం ఇవ్వటమేకదా !"

"నిజమేనా ?" అన్నాను,

"ఇద్దరిమధ్యా జరిగిన ప్రణయలేఖలు నాదగ్గరేవున్నయ్" అన్నాడు.

గతుక్కుమన్నాను.

"మరి వాడు నిజమే చెప్పాడుగా ?"

"నిజం అబద్ధం అనికాదు, అబద్ధం ఆడకూడని విషయమూకాదు. ఒక్కటి ఆలోచించు వీడి విశ్వాసం, అభిమానం ఏమయినవంటావ్ ?"

నేనేమీ మాట్లాడలేదు.

"అందుకనే మొగజాతి అంటే ఆడవాళ్ళకు అంత ఏవగింపు! నారాయణ గాడికి ఆమెతో చెడింది ఇందుకు కామా" అన్నాడు ఇంటికి మళ్లుతూ.

ఆ రాత్రల్లా ఆలోచించాను. సాంబయ్య చెప్పింది అక్షరాలా నిజం. ఆమె లొంగిన పాపానికి గాను, ఆమెనుగూర్చి నారాయణ చెడుగా మాట్లాడ గలిగాడు; వాడేమిటి—సాంబయ్య నా నోటికి తాళం వెయ్యకపోతే నేనూ అంతకు తక్కువేమీ వాగేవాణ్ని కాదు...ఇప్పుడు అర్థమౌతోంది. ఆనాడు ఆమె 'నారాయణకు తెలుస్తుందేమో' అన్నది ఇందుకనేనేమో? అసలే విశ్వాసం లేని నారాయణ; నావల్లనే నారాయణకు ఆమె స్వస్తిచెప్పి వుంటుంది—తనకు ఇంకా హాని చేస్తాడనేమో? జానకి ఎదురు తిరిగినప్పుడు ఆమె శీలాన్ని భూషించాను; నాకు లొంగినప్పుడు దూషించాను. అంటే—నాకు లొంగటమే నా దృష్టిలో ఆమె దిగజారిపోవటమైంది...

దూరం ఆలోచిస్తే ఆమె మీద—ఆమెమీదేమిటి స్త్రీజాతి మీదనే జాలి కలిగింది. ఇలాగే పురుషుల్నిగూర్చి వారు అనుకుంటారనే నమ్మకం నాకులేదు. ఆడదికోరేది పురుషుని పొత్తే ఐనా, యీ రూపంలో, ప్రచారానికి తావిచ్చే విధానంలోమాత్రం కాదేమో? అందుకనే నాబోటి వాళ్ళను జానకిలాటి తెలివి గలవాళ్లు సాధ్యమైనంత వరకూ దూరాన వుంచటం...

జానకినిగూర్చి చెడుగామాట్లాడి ఆమెతో విరోధం తెచ్చుకోకూడదని ఒట్టువేసుకున్నానంటే ఆశ్చర్యం లేదు!

